

# ఫారిన్ వెళ్ళాల(న)oడీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

### రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

### చివరి విడత: మలి సందడి (50)

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## *నేనూ నా కెటలిస్టులూ*

“రాకరాక జర్మనీ వచ్చాం. మనకి మళ్లీ ఇలాంటవకాశం వస్తుందో రాదో తెలియదు. మీరేమో, వచ్చినప్పట్నించీ ఊళ్లోనే అక్కడక్కడ తిప్పి కాలం గడిపేస్తున్నారు. నూతిలో కప్ప అని సామెతుంది కదా! అలా మేము విదేశ సందర్శనానికి సంబంధించి బెర్లిన్లో కప్పలం. ఇది డబ్బుకోసం చూసే సమయం కాదు. నాకు యూరప్ చూడాలనుంది. ట్రిప్ ప్లాన్ చెయ్యండి” అంది శ్రీమతి.

నేను లూయిజీ ప్రసక్తి తెస్తే ఆమె యూరప్ ట్రిప్పు గురించి దెప్పిందని మనసులో విసుక్కున్నప్పటికీ- కొంచెం ఆలోచిస్తే ఆమె అన్న మాటలో న్యాయముందనిపించింది. డబ్బు ఎప్పుడైనా సంపాదించొచ్చు. మళ్లీ ఇలాంటవకాశం రాదు మరి!

“ఇలా ఆలోచించలేదు. డబ్బులు బాగా మిగుల్చుకోవాలన్న అశ లేకపోతే- యూరప్ ట్రిప్పు మనకి అసాధ్యమేం కాదు. ఓంప్రకాష్‌తో మాట్లాడనా?” అన్నాను.

శ్రీమతి నవ్వి, “మీరూ ఇక్కడికొచ్చి ఇంత కాలమైంది. ఇంకా అతడిమీద ఆధారమేనా? మీకై మీరుగా ఏమైనా చెయ్యండి. లేదా అతణ్ణి కాక ఇంకెవర్నయినా అడగండి. కాస్త వెరైటీగా ఉంటుంది” అంది.

“అందరికీ ఓంప్రకాష్‌లా అన్నింటా సమర్థత ఉండదు” అని నేనింకా ఏదో అనబోతుండగా....

“అన్నింటా సమర్థతా? ఒకప్పుడు తను మెహ్‌రోత్రాని చూసి నవ్వేవాడని మీరే చెప్పారు. ఇప్పుడు మెహ్‌రోత్రా అతణ్ణి అపహాస్యం చేస్తుంటే అంతటి సమర్థుడూ తెగ ఉక్రోష పడుతున్నాడుటగా” అంది శ్రీమతి.

మెహ్‌రోత్రా ఉదంతాన్ని గుర్తు చేసిన శ్రీమతి టైమింగ్ గొప్పది.

మెహ్‌రోత్రా నాకు ఓంప్రకాష్ ద్వారా పరిచయమయ్యాడు. నాకు తెలిసిన చాలామంది ఉత్తరాదివాళ్లకిలాగే- హిందీ పట్ల దురభిమానం కలవాడు. అందువల్ల ఇతర ప్రాంతీయుల్లో ఎక్కువమంది భారతీయులు అతడితో స్నేహం చేసేవారు కాదు.

ఓంప్రకాష్ మాతృభాష ఒరియా. కానీ ఇంగ్లీషు అంత ధారాళంగానూ హిందీ కూడా మాట్లాడతాడు. అందుకని ఆదిలో మెహ్‌రోత్రా అతణ్ణి బాగా అభిమానించేవాడు. ఐతే ఓప్రకాష్‌ది విశాల దృక్పథం. అతడికి భాష, ప్రాంతం వగైరాలతో నిమిత్తం లేకుండా అక్కడున్న భారతీయులు చాలామందితో సత్సంబంధాలుండేవి. పైగా కలుపుగోలు మనిషి. స్నేహశీలి. చలాకీగా ఉంటాడు. అనుక్షణం తన పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే అతడి లక్ష్యం. ఆ పరిజ్ఞానాన్ని నలుగురికీ ఉపయోగపడేలా వాడ్డంవల్ల చాలామందికి ఇష్టుడు. అక్కడ అతడి స్నేహంవల్ల ప్రయోజనం పొందినవాళ్లలో నేనొకణ్ణి.

ఒకరోజు మెహ్‌రోత్రా ఉత్తరాది మిత్రులతో తన గదిలో సమావేశమై ఉన్న సమయంలో- ఓంప్రకాష్ నన్నతడికి పరిచయం చేశాడు.

“రావ్ అంటే మదరాసీ. ఔనా?” అన్నాడు మెహ్‌రోత్రా. అప్పట్లో తెలుగువాళ్లని అంతా మదరాసీలు అనేవారు.

“కాదు. తెలుగువాణ్ణి. మాది ఆంధ్రప్రదేశ్” అన్నాను.

“ఏదో ఒకటిలే- దక్షిణాదివాడివి. రాష్ట్రం వదిలి ఒరిస్సా కొచ్చావు కాబట్టి, ఈపాటికి నీకు హిందీ బాగా వచ్చి ఉండాలి” అన్నాడతడు.

“నాకు హిందీ రాదు. ఇంగ్లీషొచ్చుగా. దాంతో మానేజ్ చేస్తున్నాను” అన్నాను.

మెహ్‌రోత్రా వెంటనే, “నో, డాక్టర్ రావ్! ఇంగ్లీషు మనకి పరాయి భాష. ఇప్పుడు మనమేమో పరాయి దేశానికొచ్చిన భారతీయులం. ఇక్కడ మనం కలిసినప్పుడు మన భాష కదా, మాట్లాడు కోవాలి” అన్నాడు.

నిజానికి నాకు హిందీ సినిమాల్ని అర్థం చేసుకునేటంత హిందీ వచ్చు. వ్రాయగలనుచదవగలను. అవతలివాళ్లు మాట్లాడితే అర్థం చేసుకోగలను కానీ ధారాళంగా మాట్లాడలేను.

అప్పట్లో స్కూల్ ఫైనల్ పరీక్షలో పాస్ అవాలంటే, హిందీ పరీక్ష రాయడం కంపల్సరీ. ఐతే పాసై తీరాలన్న నియమం లేదు. అందుకని కొందరు ఆన్సర్ పేపర్ మీద ప్రశ్నపత్రాన్ని ఎక్కించేసేవారు.

నేనలా కాదు. హిందీలో కూడా పాసయ్యాను. స్కూల్ఫైనల్లో హిందీతో ప్యాసవడం, విడిగా హిందీలో మాధ్యమిక పరీక్ష ప్యాసవడం సమం కాబట్టి, నేరుగా రాష్ట్ర విశారద పరీక్ష వ్రాయడానికి అర్హత సంపాదించాను. అవసరమనిపించక రాయకపోతే అది వేరే సంగతి!

ఈ వివరాలు వినగానే మెహ్రోత్రా మొహం వెలిగింది, “అదీ ఇండియన్ స్పిరిట్. నీకు భాష చాలా సులభంగా వచ్చేస్తుంది. మనం కలిసినప్పుడల్లా హిందీలో మాట్లాడుకుందాం. తప్పులుంటే సరిచేస్తాను” అన్నాడు.

అప్పటికే జర్మనీలో జర్మన్లు, “నువ్వు జర్మన్లోనే మాట్లాడు. తప్పులుంటే సరిచేస్తాం” అని నొక్కిస్తున్నారు. అంచి స్కాలర్షిప్పిచ్చి, రీసెర్చి సదుపాయాలు కల్పించినందుకు– కృతజ్ఞతగా నేనా భాష నేర్చుకుంటున్నాను. పరిచయమైన ఇండియన్సంతా ఒకొక్కరుగా తమ భాష నేర్చుకోమంటే– అందుకు తగిన ఆసక్తి నాకుండాలి కదా!

నేను వెంటనే, “ఎవరికైనా మాతృభాష ఒక్కటే స్వంతం. తక్కినవన్నీ పరాయివే. పరాయి భాష నేర్చుకోవాలంటే అందుకు ఆసక్తి ఐనా ఉండాలి. లేదా ప్రయోజనముండాలి. నాకు సంగీత సాహిత్యాలపట్ల ఉండే ఆసక్తి భాషల పట్లలేదు. ఇక్కడికొచ్చి జర్మన్ నేర్చుకున్నా అది తప్పనిసరయిందంతే!” అన్నాను.

మెహ్రోత్రా వెంటనే, “నో డాక్టర్ రావ్! మనం భారతీయులం. హిందీని పరాయి భాషలతో పోల్చకూడదు. అది మన జాతీయభాష. అది నేర్చుకోవడం తప్పనిసరి” అన్నాడు.

అతడలా నొక్కించడం నాకు నచ్చలేదు. “నాకు తెలిసి మనం మాట్లాడే హిందీనిండా ఉర్దూ పదాలే. ఉర్దూ మనకి పరాయి పాలన వల్ల పుట్టుకొచ్చిన భాష. ఇంగ్లీషునీ అలా తీసుకుని జాతీయభాషకిచ్చే గౌరవాన్ని కొనసాగించడలో తప్పేముంది?” అన్నాను.

సంభాషణ తప్పుదారిన పడుతోందని అనుమానమొచ్చిందో ఏమో, ఓంప్రకాష్ కలగజేసుకుని, “రావ్ హాజ్ ఏ పాయింట్. తను ఒరిస్సా వచ్చి ఐదేళ్లు దాటింది. హిందీ మాటటుంచు. ఒక్క ముక్క ఒరియా రాదు. అలాగే మానేజ్ చేస్తున్నాడు. లోకల్సుతో అతడికే ఇబ్బందీ లేదు. దటీజ్ ఇండియన్ స్పిరిట్” అన్నాడు.

ఆ రోజు సంభాషణ అక్కడితో ఆగిపోయింది. కానీ శ్రీమతి వచ్చేలోగా మెహ్రోత్రాని మరిన్నిసార్లు కలుసుకోవడం జరిగింది.

మెహ్రోత్రాకి నేనంటే ఇష్టమే. ఎందుకంటే నాకు 1957 తర్వాతనుంచి 1974 వరకూ వచ్చిన హిందీ సినిమాల పరిజ్ఞానం చెప్పుకోతగ్గది. అది తెలిసేక హిందీ సినిమాల గురించి నన్ను చాలా ప్రశ్నలు వేశాడు. కొన్ని తెలుసుకుందుకు. కొన్ని పరీక్షించడానికి. నా ప్రతిభమీద నమ్మకం కుదిరేక, నన్ను హిందీస్ సినిమాల ఎన్సైక్లోపిడియా అనేవాడతడు. కానీ అంత తెలిసి కూడా హిందీ మాట్లాడకపోవడం అతడికి అసంతృప్తిగా ఉండేది.

ఒకసారి మాటల సందర్భంలో నేనతడితో అన్నాను, “నువ్వు నన్ను మదరాసీ అన్నావు. తెలుగువాణ్ణని చెప్పేక కూడా, అంతా దక్షిణాది వాళ్లే కదా అన్నావు. దేశప్రేమికులకు భాష ఒక్కటే ముఖ్యం కాదు. దేశంలోని ఇతర ప్రాంతాల గురించి కూడా

అవగాహన ముఖ్యం. ఎందుకంటే మదరాసీలంటే తమిళులు. ఆంధ్రప్రదేశ్‌లో ఉండేది తెలుగువాళ్లు. నాకు తెలిసి రెండు భాషలకూ సామ్యం లేదు”

మెహ్‌రోత్రా ఇబ్బందిగా మొహం పెట్టి, “నాకు దక్షిణభారతం గురించి అట్టే తెలియదన్న భావం నీక్కలిగినట్లుంది....” అన్నాడు.

“అయ్యో! నా ఉద్దేశ్యమది కాదు. మాటవరసకి నీ ప్రసక్తి తెచ్చినా, నిజానికి నేను చెప్పాలనుకున్నది నా గురించి. నేను తెలుగువాణ్ణి కదా. మా ఊళ్లో తెలుగొక్కటే చలామణీలో ఉన్న భాష. అక్కడ కొందరు ముస్లిములున్నారు. వాళ్లు తమలో తాము హిందీలో మాట్లాడుకుని, బయటివాళ్లతో తెలుగులో మాట్లాడతారు. మేమంతా చక్కని సామరస్యభావంతో కలిసిమెలిసి ఉంటున్నాము. ముస్లిములు మాట్లాడేది ఉర్దూకి దగ్గరైనా, మేమది హిందీ అనే అనుకునేవాళ్లం. అందుకని హిందీ ముస్లిముల భాష అనుకునేవాళ్లం. ఎంతలా అంటే, హిందీ సినిమాల్లో హోలీ పండుగ చూపించేవారు కదా, అది ముస్లిముల పండుగ అనుకునేవాణ్ణి నేను. ఉద్యోగరీత్యా భువనేశ్వర్ వచ్చేవరకూ ఆ అభిప్రాయమే కొనసాగింది” అన్నాను.

మెహ్‌రోత్రాకోసం అలా చెప్పినా, అందులో కొంత మాత్రమే నిజం. కాలేజి రోజుల్లో హోలీ పండుగ గురించి నాకదే అభిప్రాయముండేది. కానీ నేను ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేసే సమయంలో అది మారింది.

నెహ్రూ మరణానంతరం భారత ప్రధానిగా నియమితుడైన లాల్ బహదూర్ శాస్త్రి జాతీయవాది. ఆయన ఇంగ్లీషుని పక్కకి నెట్టి- హిందీని ముఖ్య రాజ్యభాషగా మార్చబోతున్నట్లు ప్రకటించాడు. అప్పుడు తెలిసింది నాకు- హిందీని రాజ్యభాషగా ప్రకటించమని మహాత్ముడు ఎప్పుడో నిర్దేశించాడని,

లాల్ బహదూర్ ప్రకటన దక్షిణ భారతంలో చాలామందికి నచ్చలేదు. ప్రతిఘటన అలవాటు లేని ఆంధ్రప్రదేశ్ ఐతే- నోరు విప్పి ఒక్క మాట కూడా ప్రతికూలంగా అనలేదు.

కానీ తమిళనాడులో (అప్పట్లో మద్రాసు రాష్ట్రం) మాత్రం హిందీకి వ్యతిరేకంగా అతి తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది. అది బలమైన ఉద్యమంగా మారింది. మద్రాసులో హిందీ సినిమాల ప్రదర్శన ఆగిపోయింది. దుకాణాలపై హిందీ బోర్డుల్ని పీకిపారేసి మంటల్లో వేసేశారు. హిందీని బలవంతంగా తమపై రుద్దడాన్ని సహించమంటూ- తమిళ పౌరులు దేశమంతా ప్రతిధ్వనించే నినాదాలు చేశారు. అది ఏ దశకు చేరుకుందంటే, కొందరు పెట్రోలు వంటిమీద పోసుకుని అంటించుకుని చనిపోయారు. ఈ ప్రక్రియను ప్రతిఫలించే- ‘సెల్ఫ్ ఇమ్మొలేషన్’ అనే పదం అప్పుడే ప్రాచుర్యంలోకి వచ్చింది.

లాల్ బహదూర్ శాస్త్రి భారతీయుల ప్రియతమ నాయకుడు. దేశభవితవ్యానికే ప్రాధన్యాన్నిచ్చే ఆయనకు తాపట్టిన కుందేలుకి మూడే కాళ్లనే మొండితనం లేదు. మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలని తను చేసిన ప్రకటన కొందరిలో ఇంతటి భావోద్వేగాన్ని రేకెత్తించడం ఆ మహనీయుడు తట్టుకోలేకపోయాడు. ‘దేశప్రజలందరూ సన్నద్ధులై ఆమోదముద్ర వేసేదాకా- హిందీ ఇంగ్లీషు స్థానాన్ని ఆక్రమించదు’ అని నిర్ద్వంద్వంగా ప్రకటించి- హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని నిలువరించాడు.

నాకు హిందీ అంటే వ్యతిరేకత లేదు. మెహ్‌రోత్రాకు వాస్తవం అర్థం కావాలనే నేను మా ఊరి ముస్లిములు, హోలీ- ప్రస్తావన తెచ్చాను.

అప్పటికి ఊరుకున్నా మెహ్‌రోత్రా నాదగ్గర హిందీ టాపిక్ వదల్లేదు. నేనంటే తనకి ఏర్పడిన ఇష్టంతో- నా భావాల్ని తనకు అనుకూలంగా మార్చడానికి ఏవేవో సంఘటనలు చెప్పేవాడు.

చివరిఒక్కసారి తప్పనిసరై నేనతడికి మద్రాసులో హిందీకి ప్రతికూలంగా వచ్చిన ఉద్యమం వివరాలు, దానికి లాల్ బహదూర్ అంతటివాడు దిగిరావడం చెప్పాను.

వెంటనే మెహ్‌రోత్రా నాకో ఆసక్తికర సంఘటన చెప్పాడు.

ఒకసారి అతడు, మరో మిత్రుడితో కలిసి ఆఫీసు టూర్‌మీద మద్రాసు వెళ్లి కంపెనీ గెస్ట్‌హౌసులో దిగేట్ట. అక్కడి పనివాళ్లు అంతా తమిళులేనట. వాళ్లకి బొత్తిగా హిందీ రాదు. వీళ్లు వాళ్లతో హిందీలోనే మాట్లాడుతూ, వాళ్లూ హిందీలో మాట్లాడాలని నొక్కించేవారుట. వీళ్లకోసం హిందీ వచ్చిన వేరే పనివాళ్లని పిలుస్తామంటే ఒప్పుకోలేదుట.

చివరికి వాళ్లమధ్య ఒక ఏర్పాటు జరిగింది.

ఆప్రకారం మెహ్‌రోత్రా నెమ్మదిగా హిందీలో మాట్లాడితే, బాయ్ ఆ మాటల్ని కాగితంమీద తమిళ అక్షరాల్లో వ్రాసుకుని, బయట హిందీ వచ్చినవాళ్లకి చూపించి అర్థమేమిటో తెలుసుకోవాలి. అలాగే తామివ్వాల్సిన జవాబులు కూడా అవతలివాళ్లనడిగి తెలుసుకుని కాగితంమీద తమిళ అక్షరాల్లో వ్రాసుకుని, వీళ్లముందు చదవాలి.

“నువ్వు నమ్మవు డాక్టర్ రావ్! మేమక్కడ రెండు వారాలున్నాం. నాలుగే నాలుగు రోజుల్లో వాళ్లకి మాతో వ్యవహరించడానికి సరిపడ హిందీ భాషా పరిజ్ఞానం వచ్చేసింది” అన్నాడు మెహ్‌రోత్రా.

“ఇందులో నువ్వు సాధించినదేమిటి?” అన్నాను చిరాకుని బయటపడనీకుండా.

“నువ్వు చెప్పావుగా, మద్రాసులో హిందీకి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమం జరిగిందని. ఆ తర్వాతనే మేమక్కడికి వెళ్లాం. అక్కడివాళ్ల చేతనే హిందీ మాట్లాడించాలని నా పట్టుదల. సాధించాను. వాళ్లు మాతో హిందీలో మాట్లాడుతూ సలాం కొడుతుంటే- ఓహ్ అదో గొప్ప కిక్కులే. ఆ కిక్కు కోసం వాళ్లకి ఊహించినకంటే ఎక్కువమొత్తమే టిప్పుగా ఇచ్చామనుకో” అన్నాడు మెహ్‌రోత్రా.

అంటే- అవతలివాళ్ల పేదరికాన్ని ఆసరాగా తీసుకుని, నాలుగు డబ్బులిచ్చి తన సరదా తీర్చుకున్నాడన్నమాట!

మెహ్‌రోత్రా మాత్రం అలాఅనుకోవడం లేదు, “ఈ ఉద్యమాలూ అన్నీ పెద్ద ట్రాష్. తగినవిధంగా ప్రలోభపెడితే, ఎంత పెద్ద ఉద్యమనేతలూ మనం చెప్పినట్లు ఆడతారు” అన్నాడతడు.

“అది నిజమే! ఇలాంటి అభిప్రాయం చాలామందికే ఉంటుంది. నాకు తెలిసిన రంగరాజన్ కూడా ఇదే పని చేశాడు” అన్నాను.

రంగరాజన్ కథ అప్పటికప్పుడు నేను కల్పించి చెప్పలేదు. అది నాకు భువనేశ్వర్‌లోని ఓ ఉత్తరాది మిత్రుడు చెప్పాడు.

రంగరాజన్ తమిళుడు. భాషాభిమానమే కాదు, ఆచారవ్యవహారాల్లోనూ అతడికి పట్టింపు ఎక్కువ. అటువంటివాడు ఉద్యోగరీత్యా కొన్నాళ్లు ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఉండాల్సొచ్చింది.

రంగరాజన్ దైవభక్తుడు. మధురలో బృందావనానికి తరచుగా వెడుతుండేవాడు. కానీ సంస్కృతీ సంప్రదాయాల్లో మిగతావారితో కలిసేవాడు కాదు. ఐతే అతడు ఎవరికీ ఇబ్బంది కలిగించేవాడు కాదు. తన మానాన తను బ్రతికేవాడు. ఇతరులకు సాయం చేసే గుణం ఉండడంవల్ల ఇరుగుపొరుగులతణ్ణి అభిమానించి గౌరవించేవారు. ఎవరైనా తుంటరులు కావాలని అతణ్ణి అపహాస్యం చేస్తే- వెంటనే హైలెవెల్లో పోలీస్ కంప్లయింట్ ఇచ్చేవాడు. అక్కడ అతడికున్న పలుకుబడో, లేక పౌరహక్కులు సధించడంలో అతడికున్న సమర్థతో చెప్పడం కష్టం కానీ- ఆ తుంటరులకి తగిన హెచ్చరికో, శిక్షో పడేది.

కేవలం రంగరాజన్‌కి తగిన పాఠం చెప్పాలనే- కొందరు తుంటరులూ, కొందరు ప్రాంతీయ దురభిమానులూ- హోలీ పండుగకోసం ఎదురు చూస్తున్నారు.

హోలీ పండుగ మన సంప్రదాయంలో ఒక విలక్షణ, విచిత్ర వేడుక. అప్పట్లో అది ఉత్తరాదికి మాత్రమే పరిమితమైంది.

హోలీనాడు మర్యాదస్థులు సాటివారిని కలుసుకుని- నుదుటికి బొట్టు పెట్టి, కొన్ని పొడి రంగులు కొద్దిగా మొహానికి పూసి, కొద్దిగా బట్టలపై చల్లి వెళ్లిపోతారు. ఐతే పండుగ వచ్చేసరికి ఉత్తప్పుడు మర్యాదస్థులైనవాళ్లల్లో కూడా చిలిపితనం పుట్టి, అల్లరిగా, చిల్లరగా ప్రవర్తించడం కద్దు. అందుకు ప్రతిఘటించకపోతే- వారిని తేలికగా వదిలిపెడతారు. ప్రతిఘటిస్తే మాత్రం- రెచ్చిపోతారు. రంగు నీళ్లతో మొదలై- మురికినీళ్లు చల్లడం, పేడ లాంటి అశుద్ధ పదార్థాలు కలిపిన నీళ్లు పొయ్యడం, ఓ పట్టాన వదలని పెయింట్లు పుయ్యడం, బట్టలు చింపెయ్యడం దాకా వెడుతుంది. కొందరైతే రంగు నీళ్ల డ్రమ్ముల్లో ముంచి తేలుస్తారు. ఇంకా కొంతమంది నీళ్ల మడుగుల్లోకి విసిరేస్తారు. ఆ రోజు ఎవరేం చేసినా అది ప్రతిఘటించకుండా ముచ్చటపడాలని స్థానికులు అనుకుంటారు. ఇలంటి పండుగల్లో తుంటరులకి ఆకాశమే హద్దు. వాళ్లలో కొందరికి ప్రతి హోలీ పండుగకీ కొందరు లక్ష్యంగా ఉంటారు.

సత్సంప్రదాయంగా మొదలైన హోలీ వేడుక- క్రమంగా గాడి తప్పి- అవాంఛిత సంఘటనలకూ దారి తీస్తోంది. ఐనా ఆనాటి విశేషాల్ని అ నాటితోనే మర్చిపోవాలని సరిపెట్టుకునేవారున్నారు.

రంగరాజన్ అలా సరిపెట్టుకునే రకం కాదు. అతణ్ణి లక్ష్యంగా చేసుకున్నవారు వదిలే రకం కాదు..

హోలీ పండుగకు ముందే కొందరు శ్రేయోభిలాషులతణ్ణి ఆ విషయమై హెచ్చరించి, "నువ్వు ప్రతిఘటిస్తావు. అది జనాల్ని రెచ్చగొడుతుంది. పోనీ అని ప్రతిఘటించకుండా లొంగిపోయినా- కొందరు నిన్ను వదలరు. మా మాట విని- వెంటనే మీ ఊరెళ్లి- హోలీ అయ్యేక తిరిగిరావడం అన్నివిధాలా మంచిది" అని సలహా ఇచ్చారు.

రంగరాజన్ తొణకలేదు. బెణకలేదు. ఊరెళ్లను కాక వెళ్లనన్నాడు.

"ఇది ప్రజాస్వామ్యం. అంగీకారం లేకుండా తాళి కట్టిన భార్యకు దగ్గరవకూడదని శాసించే గొప్ప చట్టం మనది. అలాంటి రాజ్యాంగమున్న దేశంలో పౌరుణ్ణి నేను. నా అనుమతి లేకుండా నాతో ఎవరూ హోలీ ఆడకూడదు. అది శాసన ధిక్కారం. నాకు హోలీ పండుగ నచ్చదు. ఎవరైనా బలవంతంగా ఆడితే అది అత్యాచారంతో సమానం" అని అతడు వాదించాడు. ఆ మేరకు తనను సంఘ వ్యతిరేకశక్తుల్నించి కాపాడవలసిందిగా ఆయన ముందుగానే కోర్టుని వేడుకున్నాడు,

అప్పుడు జరిగింది విచిత్రం.

పండుగ రోజు ఉదయానే స్నానం చేసి- తెల్లటి బట్టలు వేసుకుని ఇంటి బయటకు వచ్చాడు రంగరాజన్. అతడి చుట్టూ నలుగురు సాయుధ పోలీసులు ఉన్నారు. రంగరాజన్ జోలికొచ్చినవాళ్లని అరెస్టు చేస్తామని వాళ్లు చెప్పారు.

రంగరాజన్ ఇంట్లో కూర్చోలేదు. పోలీసుల సాయంతో అతడు ఊరంతా తిరిగాడు. అంత పెద్ద నగరంలో మొత్తం పౌరులంతా రంగుల మయమై కనబడుతున్న తరుణంలో అతడొక్కడూ- తెల్లని మల్లెపూవులాంటి బట్టల్లో మెరిసిపోతూ ఊరంతా తిరిగాడు.

ఈ కథ విన్న మెహ్‌రోత్రా, "నేను నమ్మను. నా కథకు కౌంటరుగా ఈ కథ అల్లి చెప్పావు. ఔనా?" అన్నాడు.

"నువ్వు చెప్పింది కథ అని నేననుకోలేదు. నేను చెప్పింది కథ అని నువ్వూ అనకూడదు. నీది కథ అనుకో. దానికి కౌంటరొకటి ఉంటుందని నువ్వు గ్రహించాలి" అన్నాను.

"దానికీ దీనికీ సామ్యమెక్కడుంది?  అది ఓ గెస్ట్‌హౌస్‌లో నలుగురు మనుషులమధ్య జరిగింది. ఇక్కడ ఒక నగరంలో ఒక వ్యక్తి మొత్తం నగరవాసులందరికీ విరుద్ధంగా ప్రవర్తించాడు. ఇంట్లో కూర్చుంటే సరిపోయేదానికి, ఊరంతా పర్యటించడం ద్వారా- నగరంలో అధిక సంఖ్యాకుల మనోభావాలు దెబ్బతినేలా చేశాడు. అది కూడా శాసన ధిక్కారమే!" అన్నాడు మెహ్‌రోత్రా.

"హోలీ ఆడేవారు ఆట ఆడ్డానికి బాధితుల అనుమతి తీసుకోకపోవడం శాసన ధిక్కారం కదా! ధిక్కారానికి ధిక్కారంతో బదులిచ్చాడు రంగరాజన్. అంతే!" అన్నాను.

"ఐనా దీనికీ, నా మద్రాసు గెస్ట్‌హౌస్ సంఘటనకీ సామ్యమేమిటి?" అన్నాడు మెహ్‌రోత్రా.

"చాలా సామ్యముంది. నీవద్ద డబ్బుంది. ఆ డబ్బుతో కొందరు పేదవాళ్లని అసహాయుల్ని చేసి నీక్కావాలసిన కిక్ పొందావు. ఒక మహా నగరంలో పౌరుడిగా తన రక్షణ బాధ్యతను ప్రభుత్వానికి అప్పగించి- రంగుల్లో మునిగి తేలుతున్న ఎందరో జనం మధ్య తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ- చూపరులను అసహాయుల్ని చేసి కిక్ పొందాడు రంగరాజన్. మద్రాసులో నీకూ మధురలో అతడికీ కూడా సామరస్య భావం లేదు. కిక్ కావాలి. అదీ సామ్యం" అన్నాను.

మెహ్‌రోత్రాకి ఏమనాలో తెలియలేదనుకుంటాను. చెయ్యిజాపి, "ఐ గాట్ యువర్ పాయింట్" అన్నాడు ఇంగ్లీషులో.

నేనతడికి షేక్‌హాండిచ్చి, "షుక్రియా" అన్నాను హిందీలో.

ఆ తర్వాతనుంచి మేమెప్పుడూ భాషలు, ప్రాంతాల గురించి వివాదాస్పద చర్చలకు వెళ్లలేదు. అంతవరకూ మామధ్య జరిగిన సంభాషణలు- మా మధ్య స్నేహభావానికీ అడ్డు కాలేదు.

నేను ఎక్కువగా ఓంప్రకాష్‌తో తిరిగేవాణ్ణి.

నేనే కాదు, చాలామంది ఓంప్రకాష్‌తో స్నేహాన్ని ఇష్టపడేవారు. సలహాలకూ, సూచనలకూ అతణ్ణి సంప్రదించేవారు.

తనంతటివాడు తానని మెహ్‌రోత్రా అభిప్రాయం. అతడికి ఓంప్రకాష్ పాప్యులారిటీ అసూయను కలిగించేది. ఇద్దరూ కలిసినప్పుడు అతడిపై ఏదో విసురు విసిరేవాడు. ఓంప్రకాష్ తిప్పికొట్టేవాడు. మెహ్‌రోత్రా నవ్వులపాలయ్యేవాడు.

అది ఓంప్రకాష్‌లో కొంత అహంకారాన్ని పుట్టించింది. అదే అతడి కొంప ముంచింది.

మెహ్‌రోత్రా, ఓంప్రకాష్- ఇద్దరూ థీసిస్ సిద్ధం చేసుకుంటున్నారు.  ఇద్దరిలో ఓంప్రకాష్‌కి అప్పటికే ఇంటర్నేషనల్ జర్నల్సులో మంచి పబ్లికేషన్సు ఉన్నాయి. మెహ్‌రోత్రా థీసిస్‌తో పోలిస్తే- తన థీసిస్‌కి విలువెక్కువన్న అతడి అభిప్రాయంతో చాలామంది ఏకీభవించేవారు.

ఇక థీసిస్ సబ్మిషన్ దగ్గరపడుతోందనగా- అప్పుడు పేలింది బాంబు.

జర్మన్ యూనివర్సిటీలో థీసిస్ సబ్మిట్ చెయ్యడానికి- జర్మన్ భాషలో ఒక స్థాయి పరీక్ష ప్యాస్ కావాల్సి ఉంది. అందుకు మినహాయింపు ఉన్నదని ఓంప్రకాష్ గట్టిగా నమ్మాడు. అతడా పరీక్ష వ్రాయలేదు. ఆ విషయమై ఎవర్నీ సంప్రదించలేదు.

మెహ్‌రోత్రాకు జర్మన్ పరీక్ష ప్యాసవడం కంపల్సరీ అని తెలుసు. అతడు కష్టపడి చదివి పరీక్ష క్లియర్ చేశాడు. థీసిస్ సబ్మిట్ చెయ్యడానికి  అతడికింకే అడ్డంకీ లేదు.

ఓంప్రకాష్ థీసిస్ విషయంలో ఎంత నమ్మకంగా ఉన్నాడంటే- అతడు అప్పటికే ఓ అమెరికా యూనివర్సిటీలో అడ్మిషన్ సంపాదించాడు. థీసిస్ సబ్మిట్ చెయ్యగానే అమెరికా వెళ్లిపోవాలనుకుంటున్నాడు. ఆ విషయమై చాలామంది అతణ్ణి అభినందించారు కూడా.

ఇప్పుడు ఓంప్రకాష్ థీసిస్ వెనక్కి వెళ్ళింది. అభినందించినవారు అంతా ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారు. వాళ్లలో మెహ్‌రోత్రా కూడా ఉన్నాడు.

“నా అభిప్రాయంలో ఓంప్రకాష్ సర్వజ్ఞుడు. అన్నీ తెలిసిన అతడికి ఇదీ తెలుసనుకున్నాను. లేకుంటే నాకీ విషయం మొదట్నించీ తెలుసు. నాకే తెలిసిన ఇంత చిన్న విషయం అతడికి తె;ఇయకపోదా అని ఊరుకున్నాను. లేకపోతే అడిగిమరీ చెప్పేవాణ్ణి....” అన్నాడతడు.

మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు- అన్నట్లు మెహ్‌రోత్రా అన్న ఈ మాటలకు ఓంప్రకాష్ డీలా పడిపోయాడు.

“చాలా సార్లు మా మధ్య ఈ పరీక్ష గురించిన ప్రసక్తి వచ్చింది. అది ప్యాసవాల్సిన అవసరం లేదని నేను నమ్మకంగా చెబుతుంటే, నవ్వి ఊరుకున్నాడే తప్ప మాటవరుసకి కూడా- అసలు విషయం చెప్పలేదు” అని ఓంప్రకాష్ నావద్ద వాపోయాడు.

ఒకరిది అహంకారం. ఒకరిది అసూయ. రెండూ కలిసి ఇప్పుడు ఓంప్రకాష్‌ని దెబ్బతీశాయి.

శ్రీమతి నాకిప్పుడా విషయాన్నే గుర్తు చేసింది.

“నువ్వన్నది నిజమే! ఓంప్రకాష్ ఇప్పుడున్న పరిస్థితుల్లో, మన యూరప్ ట్రిప్పు ప్రస్తావన సబబు కాదు. మరి ఈ విషయంలో నాకు సాయం చెయ్యగలవారెవ్వున్నారూ!” అన్నాను సాలోచనగా.

“ఉన్నాడుగా మీ స్టూడెంటు లూయిజీ. అతణ్ణడగండి.....” అంది శ్రీమతి.

తను మా యూరప్ ట్రిప్పుకి లూయిజీ ప్రస్తావన తేవడంలోని అంతరార్థం నాకప్పుడు తెలియలేదు.......

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments